dctelugu.com

డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుటీ: 01 సంచిక: 21 04 శుక్రవారం, ఆగస్టు 2026

## మంత్రి పదవి నుంచి

# కొండా బర్తరఫ్

**హైదరాబాద్ డీసీ**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచించినప్పటికీ రాజీనామాకు సురేఖ నిరాకరించడంతో, ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తూ సీఎంఓ నుంచి అధికారిక సిఫార్సు లేఖ గౌరవ గవర్నర్‌కు చేరింది. కొంతకాలంగా ప్రభుత్వ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్న సురేఖ, సీఎం కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం మరియు ఆమె కుమార్తె సుస్మితా పటేల్ సీఎంపై చేసిన వ్యక్తిగత విమర్శలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి తనపై చర్యలను ప్రశ్నించిన సురేఖ, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే ముందుగా రేవంత్ రెడ్డికే షోకాజ్ నోటీసు ఇవ్వాలని వాదించిన మరుసటి రోజే ఈ బర్తరఫ్ వేటు పడింది.

ఈ కేబినెట్ ప్రక్షాళనతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ మార్పులు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేసి, ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత నేరెళ్ల శారదను ఎంపిక చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో ప్రాధాన్యత సమతుల్యత కోసం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని నియమిస్తూ సీఎంఓ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ పరిణామాలు రేవంత్ రెడ్డికి పార్టీ, పాలనపై ఉన్న పూర్తి పట్టును స్పష్టం చేస్తున్నాయి. కాగా, ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించి నల్గొండ క్రాస్ రోడ్స్ సమీపంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

# ఏకపక్షంగా బర్తరఫ్

## కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ డీసీ**



తెలంగాణ కేబినెట్ నుంచి తనను తొలగించడంపై మాజీ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనను పదవి నుంచి తొలగించకపోతే తానే తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేసి, ఏకపక్షంగా తనను బర్తరఫ్ చేయించారని ఆరోపించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే ముందే మీడియాతో మాట్లాడిన ఆమె, తన తొలగింపునకు గల కారణాలను వివరణగా కోరకపోవడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. తన వివరణ తీసుకోకుండా, కనీసం రాజీనామా చేయమని కూడా అడగకుండా ఒక బీసీ మహిళా మంత్రిగా తనను తీవ్రంగా అణచివేసి అవమానించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్ర వెనుక వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు ఉన్నారని స్పష్టం చేశారు. తన కుమార్తె కొండా సుస్మిత స్వతంత్ర అభిప్రాయాలు ఉన్న మహిళ అని, ఆమె మాట్లాడిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేస్తూ చర్యలు తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. మంత్రి పదవి నుంచి తొలగించే క్రమానికి ముందే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాసిన లేఖను కూడా ఈ సందర్భంగా కొండా సురేఖ బహిర్గతం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు నియామకం, సమ్మక్క-సారలమ్మ ఆలయ నిధుల బదిలీ, శ్రీరామనవమి ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటో తొలగింపు వంటి అంశాల్లో తీవ్ర వివక్ష చూపారని ఆ లేఖలో పేర్కొన్నారు. దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకుంటున్నా సీఎం పట్టించుకోలేదని, తన అనుమతి లేకుండానే తన ఓఎస్డీ సుమంత్‌ను తప్పించి

➢ మిగతా 2వ పేజిలో..

## వారం దాటిన వేలాది మంది లభించని వేలాది మంది ఆచూకి



**ఖాట్మాండ్ డీసీ**

నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదలు మరియు ప్రకృతి విలయంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఏకంగా 1,252కి చేరింది. విపత్తు సంభవించి వారం రోజులు దాటినా వేలాది మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతుండటంతో క్షతగాత్రులు, బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. నేపాల్ పోలీసులు విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం అత్యధికంగా చిత్వాన్ జిల్లాలో 355, నవల్‌పరాసి తూర్పులో 218, నవల్‌పరాసి పశ్చిమంలో 208, నువాకోట్ జిల్లాలో 177 మృతదేహాలను వెలికితీశారు. వీటితో పాటు రసువా, గోర్ఖా, ధాడింగ్, తహను జిల్లాల్లోనూ భారీగా ప్రాణనష్టం నమోదైంది. దాదాపు 4,800 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాలకు

➢ మిగతా 2వ పేజిలో..

## తమ ద్వైపాక్షిక సంబంధాలు

# వ్యూహాత్మక స్థాయికి



**న్యూఢిల్లీ డీసీ**

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత్, బెల్జియం తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం నిర్వహించిన విస్తృత చర్చల్లో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, అంతర్జాతీయ

➢ మిగతా 2వ పేజిలో..

## ట్రంప్ జలసంధిగా

# మారుస్తాం

### అమెరికా ప్రెసిడెంట్ సంచలన పోస్టు



**న్యూఢిల్లీ డీసీ**

ఇరాన్‌తో యుద్ధ పరిణామాలు కొనసాగుతున్న వేళ, అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి పేరును 'ట్రంప్ జలసంధి'గా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్ట్ చేస్తూ ప్రస్తుతం హర్మూజ్ జలసంధి అమెరికా నియంత్రణలోకి వచ్చిందని, దానికి తన పేరు పెడితే అమెరికా మాదిరిగానే అది కూడా మరింత "హాట్"గా మారుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ భౌగోళిక ప్రాంతాల పేర్లను మార్చడం ట్రంప్‌కు కొత్తేమీ కాదు.

➢ మిగతా 2వ పేజిలో..

# ఏకపక్షంగా బర్తరఫ్

**మొదటిపేజీ తరువాయి..** ఆయనపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. గతంలో పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జగ్గారెడ్డి వంటి వారిపై చర్యలు తీసుకోని పార్టీ, తన విషయంలో మాత్రం కక్షపూరితంగా వ్యవహరించిందని ప్రశ్నించారు. ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ తాను సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీల నాయకత్వానికే కట్టుబడి ఉంటానని, కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన లేదని తేల్చిచెప్పారు. కాగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో పాటు ఆమె వర్గీయులపై వేటు పడటం, బీజేపీ ఆహ్వానం అందించడం మరియు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆమెను తమ పార్టీలోకి ఆహ్వానిస్తూ ప్రకటనలు చేయడంతో తెలంగాణ రాజకీయ సమీకరణాలు తీవ్ర ఉత్కంఠగా మారాయి.

# ట్రంప్ జలసంధిగా మారుస్తాం

**మొదటిపేజీ తరువాయి..** గతంలో గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా, ఇటీవల కెనడాతో వాణిజ్య ఉద్రిక్తతల సందర్భంగా 'లేక్ అంటారియో'ను 'లేక్ అమెరికా'గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే క్రమంలో ఇప్పుడు హర్మూజ్ జలసంధిపై కూడా అమెరికాకే సార్వభౌమాధికారం ఉందంటూ, దాన్ని అమెరికా కొత్త భూభాగంగా చూపుతున్న ఒక మ్యాప్‌ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ యుద్ధ పరిణామాలు, జలసంధి పరిధిలోని తాజా పరిస్థితులపై ట్రంప్ వెల్లడించిన ఇతర ముఖ్యాంశాలు: రాడార్, క్షిపణి వ్యవస్థల ధ్వంసం: హర్మూజ్ జలసంధి చుట్టూ ఇరాన్ కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక వ్యవస్థలు, రాడార్లు, క్షిపణి సంబంధిత పరికరాలు మరియు కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు తీవ్ర స్థాయి దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేశాయి. మందుపాతరల తొలగింపు: జలసంధిలో ఇరాన్ అమర్చిన మందుపాతరలను అమెరికా సైన్యం తొలగించిందని, మందుపాతరలు వేసేందుకు ఇరాన్ చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టామని ట్రంప్ తెలిపారు. చమురు రవాణా భద్రత: లక్షలాది బ్యారెళ్ల చమురును మోసుకెళ్లే వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలగకుండా, వాటిని సురక్షితంగా బయటకు తీసుకురావడంపై అమెరికా దృష్టి సారించింది. యుద్ధ వ్యవధి: ఇరాన్‌పై ప్రారంభించిన ఈ సైనిక చర్యలు చాలా కాలం పాటు కొనసాగుతాయని తాను భావించడం లేదని ఓవల్ ఆఫీస్ మీడియా సమావేశంలో ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, అవసరమైనప్పుడు ఎప్పుడైనా మళ్లీ దాడులు చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు.

## తప్పించడం ఆమోదయోగ్యమే

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తప్పించడం ఆమోదయోగ్యమేనని, అది పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. పార్టీ, ప్రభుత్వం తరపున ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ సురేఖ వాటిని నిలబెట్టుకోలేకపోయారని, ముఖ్యంగా తన సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ మరియు ఆమె కుటుంబ సభ్యులు పదేపదే బహిరంగంగా విమర్శలు గుప్పించి పార్టీ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించారని ఆరోపించారు. ఈ పరిణామంపై ఆది శ్రీనివాస్ వెల్లడించిన ఇతర ముఖ్యాంశాలు:అగ్రనాయకత్వానిదే నిర్ణయం: సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ హైకమాండ్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయాన్ని ఖరారు చేసిందని స్పష్టం చేశారు.అసత్య ప్రచారం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేసి బర్తరఫ్ చేయించారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఖండించారు. చిన్నా రెడ్డి అంశం: తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ పదవి నుండి తొలగించబడిన జి. చిన్నారెడ్డి అంశంపైనా స్పందించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్‌కి ఎంతో గౌరవమని, అయితే ఎంతటి సీనియర్ నేతలైనా సరే పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు.

## జెమ్స్ స్కూల్లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



**జగిత్యాల డీసీ : సెప్టెంబర్**

పట్టణంలోని విజయపురి కాలనీ బైపాస్ రోడ్డులోని జెమ్స్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోకుల వాతావరణం, స్నేహం, ప్రేమ, ధర్మం, సత్యం వంటి అంశాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, భక్తిగీతాలు నిర్వహించారు. చిన్నారుల చిన్ని చిన్ని అడుగులు, మురళీధరుడి వేషధారణ, రంగురంగుల అలంకరణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కెంచు చిన్నన్న మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం విద్యార్థులకు ఎన్నో గొప్ప సందేశాలను అందిస్తుందన్నారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం, స్నేహాన్ని గౌరవించడం, సత్యం-ధర్మం వైపు నిలబడటం, తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించడం వంటి విలువలను పిల్లలు అలవర్చుకోవాలని సూచించారు. పండుగలను కేవలం ఉత్సవాలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న సంస్కృతి, విలువలను తెలుసుకునే అవకాశాలుగా మలచడమే జెమ్స్ స్కూల్ లక్ష్యమని తెలిపారు.

ప్రిన్సిపాల్ కెంచు మల్లిక మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రేమ, స్నేహం, దయ, క్రమశిక్షణ, ధైర్యం వంటి సద్గుణాలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని అన్నారు. శ్రీకృష్ణుడి బోధనలను జీవితంలో ఆచరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, కృష్ణ--రాధ వేషధారణలు, భక్తి గీతాలు, నృత్య కార్యక్రమాలతో కృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

# వారం దాటిన వేలాది మంది లభించని వేలాది మంది ఆచూకి

**మొదటిపేజీ తరువాయి..** డిఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తుండగా, 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గల్లంతైన తమవారు ఇక తిరిగిరారనే చేదు నిజాన్ని దిగమింగుకున్న పలువురు బంధువులు పశుపతి ఆర్యఘాట్ వద్ద ప్రతీకాత్మక దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నేపాల్ ఆర్మీ నేతృత్వంలో 21,314 మంది భద్రతా సిబ్బంది ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు శ్రమిస్తున్నారు. ఇప్పటివరకు 11,993 మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నువాకోట్‌లోని బిదూర్‌లో రహదారులు కొట్టుకుపోవడంతో త్రిశూలీ నదిపై తాత్కాలికంగా జిప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజలను దాటిస్తున్నారు. అయితే, భోటేకోశీ, త్రిశూలీ నదుల వద్ద ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టుల భూగర్భ సొరంగాల్లో టన్నుల కొద్దీ బురద పేరుకుపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ ప్రాజెక్టులకు చెందిన 947 మంది కార్మికులు ఆచూకీ లేకుండా పోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు సింధుపాల్‌చోక్, రసువా, నువాకోట్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మోస్తరు నుండి భారీ వర్షాలు రెస్క్యూ బృందాలకు సవాలుగా మారాయి.

ఈ తీవ్ర అపార నష్టం నేపథ్యంలో నేపాల్‌ను ఆదుకునేందుకు అంతర్జాతీయ సమాజం వేగంగా స్పందిస్తోంది. భారత్ ఇప్పటికే మరో 5 టన్నుల వైద్య సామగ్రి, ప్రత్యేక రెస్క్యూ పరికరాలు, 11 మంది నిపుణుల బృందాన్ని ఐదో విమానంలో నేపాల్‌కు పంపగా, ఇప్పటివరకు 166 మంది భారతీయులను సురక్షితంగా రక్షించింది. అలాగే అమెరికా ప్రభుత్వం 3.6 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయంతో పాటు రెండు సైనిక కార్గో విమానాల్లో 5,000 పునరుద్ధరణ కిట్లు, ప్రథమ చికిత్స సామగ్రి, హెవీ లోడర్లను పంపించినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. చైనా సహా ఇతర పొరుగు దేశాలు కూడా పెద్ద ఎత్తున నిత్యావసరాలు, ఔషధాలను సరఫరా చేస్తూ నేపాల్‌కు బాసటగా నిలుస్తున్నాయి.

# చెన్నై నగరాన్ని ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా మార్చే లక్ష్యం

తమిళనాడును అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శాసనసభలో (నిబంధన 110

# తమ ద్వైపాక్షిక సంబంధాలు వ్యూహాత్మక స్థాయికి

**మొదటిపేజీ తరువాయి..** సవాళ్లు, ఆహార-ఇంధన సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా రాణిస్తోందని తెలిపారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు విశ్వాసాన్ని అందిస్తూ కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ వివాదాలు, యుద్ధాలపై స్పందిస్తూ ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో శాంతి స్థాపనకు చర్చలు, దౌత్య మార్గాలే శ్రేయస్కరమని మోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాని నిర్మూలనకు ఇరుదేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ భేటీ సందర్భంగా పునరుత్పాదక ఇంధన రంగంలో సహకారం కోసం కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. అలాగే కీలక ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్, సురక్షితమైన సప్లై చైన్ నిర్వహణలో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. సెమీకండక్టర్ రంగంలో బెల్జియం వద్ద ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారత్‌లోని విస్తృత ఉత్పత్తి సామర్థ్యం పరస్పరం ప్రయోజనకరంగా మారతాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ రంగంలోనూ ఆధునిక సాంకేతికత తయారీ, పరిశ్రమల భాగస్వామ్యంపై ఇరుదేశాలు దృష్టి పెట్టాయి.

మరోవైపు భారత్ మరియు యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్టీూ) ఇరు ప్రాంతాల మధ్య ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ కొనియాడారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తులుగా భారత్, ఈయూల మధ్య పెరుగుతున్న సహకారం అంతర్జాతీయ స్థిరత్వానికి, ఆర్థిక ప్రగతికి ఎంతగానో తోడ్పడుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## అమెరికాలో జన్మతః పౌరసత్వం

అమెరికాలో జన్మతః పౌరసత్వం పొందే హక్కుపై ఆంక్షలు విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన నూతన కార్యనిర్వాహక ఉత్తర్వులకు ఫెడరల్ కోర్టులో మరోసారి తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా గడ్డపై జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు స్వయంచాలకంగా లభించే పౌరసత్వానికి పరిమితులు విధించాలన్న ప్రభుత్వ ప్రయత్నాల అమలును వాషింగ్టన్ డిసి ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి డెబోరా బోర్డ్‌మన్ నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు పౌరసత్వం దక్కకుండా ట్రంప్ తీసుకొచ్చిన ఈ తాజా ఉత్తర్వులు గత వేసవిలో అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన రాజ్యాంగబద్ధ తీర్పునకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం దేశంలో జన్మించిన ప్రతి శిశువుకు వారి తల్లిదండ్రుల వలస హోదాతో సంబంధం లేకుండా పౌరసత్వం లభిస్తుందని, ట్రంప్ ఆదేశాలు దీన్ని ఉల్లంఘించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వులను నిలిపివేయకపోతే అర్హులైన చిన్నారులు సైతం తమ రాజ్యాంగబద్ధ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.

రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే వలసదారులపై కఠిన నిబంధనలు తెచ్చిన ట్రంప్‌కు గతంలోనూ సుప్రీంకోర్టులో ప్రతికూల తీర్పు వచ్చింది. ఆ తీర్పు తర్వాత పరిధిని కొంత తగ్గించి---శత్రు దేశ వలసదారులు, విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, బర్త్ టూరిజం కింద వచ్చే వారి పిల్లలకు పౌరసత్వం నిరాకరించేలా ఆగస్టులో ట్రంప్ మళ్లీ కొత్త రూపంలో ఉత్తర్వులు ఇచ్చారు. అయినప్పటికీ, ఈ సవరించిన నిబంధనలు కూడా పరోక్షంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని కోర్టు తేల్చిచెప్పడంతో ట్రంప్ ప్రభుత్వ వలస విధానాల అమలుకు మళ్లీ పెద్ద విఘాతం ఏర్పడింది.